క్లుప్తంగా

శింగరకొండ దర్శిని

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. దక్షిణాయనం పుష్య మాసం అనూరాధ నక్షత్రం ఏకాదశి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఆయుష్మాన్ భారత్ సర్వే



సర్వే నిర్వహిస్తున్న వలంటీర్‌లు

చినగంజాం: మండలంలోని పంచాయతీల్లో ఆయుష్మాన్ భారత్ కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మంగళ వారం మండలంలోని పలు పంచాయతీల్లో గ్రామ వలంటీర్‌లు ఇంటింటికి తిరిగి బయోమెట్రిక్ సర్వే నిర్వహించినట్లు ఆమె తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య హెల్త్ కార్డులు జారీ చేసే కార్యక్రమంలో భాగంగా ఈకేవైసీ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 50 శాతం సర్వే పూర్తి చేశామని, మిగిలిన సర్వేను కూడా త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు.

గోశాలలకు ఎండు గడ్డి అందజేత



గడ్డిని అందజేస్తున్న గోసంరక్షణ సంస్థ సభ్యులు

అద్దంకి రూరల్: గోసంరక్షణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం గోశాల నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావుకు రూ. 16 వేల విలువగల ట్రాక్టర్ ఎండు గడ్డిని వెయ్యి రూపాయల కొమ్మరిపిట్టును డీవీఎం సత్యనారాయణ అందజేశారు. గో సంరక్షణ సంస్థ ద్వారా ప్రతి ఒక ట్రాక్టర్ ఎండుగడ్డిని గోశాలకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, చాగంటి శేషారెడ్డి, చుండూరి మురళీ సుధాకరరావు, పసుమర్తి రామారావు, నాగసూరి సుబ్బారావు, అమరనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

200 మందికి దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

పర్చూరు: పర్చూరు ప్రాంతంలో విద్యాభివృద్ధికి, చిన్మయా మిషన్ శాఖ ద్వారా గ్రామానికి సేవలు అందించిన రోటరీ క్లబ్ స్థలదాత పాబోలు రాధాకృష్ణమూర్తి 84వ జయంతి సందర్భంగా వారి కుమారులు పాబోలు ఉదయ భాస్కర్, గిరిజాకుమారి దంపతులు స్థానిక కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో 200 మంది నిరుపేదలకు దుప్పట్లు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీరాం సుబ్బారావు, తాటి లింగేశ్వరరావు,కొసనా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

బల్లికురవ: ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలు సొంత స్థలాలకు మంజూరు చేసిన పక్కా గృహాలకు తక్షణమే నిర్మాణ పనులు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. మంగళవారం సాయంత్రం 20 సచివాలయల్లోని సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలానికి మంజూరైన 621 గృహాల్లో ఇంకా 238 మంది ఇంకా నిర్మాణ పనులు చేపట్టలేదని చెప్పారు. ప్రాధాన్యత భవనాలు కూడా తక్షణమే నిర్మించాలని కోరారు. సమీక్షలో ఈవోఆర్డీ జీ. సీతామహాలక్ష్మి, మండలస్థాయి అధికారులు కోరారు.

అసభ్యకరంగా ప్రవర్తించాడని ఫిర్యాదు

బల్లికురవ: కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో పథకం ప్రకారం ఇంట్లోకి వచ్చి తనపై అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ మండలంలోని వైదన గ్రామానికి చెందిన ఓ మైనర్ సోమవారం అర్ధరాత్రి బల్లికురవ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వైదన గ్రామానికి చెందిన డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న ఏలూరి అజయ్ సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చి తనపై అసభ్యకరంగా ప్రవర్తించాడని ఫిర్యాదుతో వాపోయింది. ఈ మేరకు మంగళవారం సంతమాగులూరు సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్సై వీ. వేమన కేసు నమోదుతో గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు.



గోవాడలో సాగులో ఉన్న కరివేపాకు

కాసులు కురిపిస్తున్న కరివేపాకు

- ఎకరాకు లక్ష పెట్టుబడితో రూ. 4నుంచి 5 లక్షల వరకు ఆదాయం
- నియోజకవర్గంలో 300 ఎకరాల్లో కరివేపాకు సాగు
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- టన్ను రూ. 40 వేలకు పైగా ధర

బల్లికురవ: ఎన్ని పదార్థాలతో వంటలు చేసినా ఆ ఒక్కటి లేకపోతే మజా ఉండదు. అది సాంబారు అయినా, రసం అయినా, మాంసాహారం, శాఖాహారం ఇలా ఏదైనా సరే అది లేకపోతే ఏదో వెలితి. తిన్నా కూడా తిననట్టే ఉంటుంది. పోపులో పడకపోతే రుచినివ్వను అంటోంది అదే కరివేపాకు. కరివేపాకులో కాల్షియం, పొటాష్, ఫైబర్, విటమిన్ ఏ, సీ పుష్కలంగా ఉంటాయి. అంతేకాదండోయ్ ఆంటీ డయాబెటిక్, అధిక కొవ్వును తగ్గించడం, దురదలు, శ్వాసకోశ వ్యాధుల నియంత్రణకు అద్భుతంగా పనిచేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెప్తున్నారు. వ్యాపార, వాణిజ్య పంటల సాగులో కలిగే ఆటుపోట్లతో విసిగి వేసారిన రైతులు కూరల్లో నిత్యం వాడే కరివేపాకు సాగుతో నాలుగేళ్లుగా లాభాలు ఆర్జిస్తున్నారు. రెండు నెలలుగా కరివేపాకు ఎక్కడలేని గిరాకీతో లాభాలు పంట పండుతోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అధిక సాగు ప్రాంతాలు..

అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ మండలంలోని వల్లాపల్లి, సంతమాగులూరు మండలంలోని మక్కెనవారిపాలెం, కొమ్మాలపాడు, కొరిశపాడు మండలంలోని కుర్రవానిపాలెం, రావినూతనల, పీ. గుడిపాడు, అద్దంకి మండలంలోని కొత్తరెడ్డిపాలెం, వెంపరాల, గోవాడ, శాంతినగర్ గ్రామాల్లో రైతులు సుమారు 300 ఎకరాల్లో కరివేపాకు సాగు చేశారు.

అనూహ్యంగా పెరిగిన ధర..

గత డిసెంబర్ నెలలో టన్ను ధర రూ. 25 వేలు పలకగా జనవరిలో రూ. 40 వేలకు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదే ధర రెండు నెలలు పాటు ఉంటే ఖర్చులు పోను ఎకరాలకు రూ. 4 నుంచి రూ. 5 లక్షల వరకు నికర ఆదాయం దక్కుతుందని రైతులు బాదం హనుమారెడ్డి, పాలెం మోహన్‌రెడ్డి సాక్షికి తెలిపారు.

ఎకరా సాగుకు రూ.1 లక్ష పెట్టుబడి..

రోడ్డు, నీటి వసతి కలిగిన సారవంతమైన భూమిలో తొలకరి పంటగా జూన్‌లో కరివేపాకు సాగు చేస్తున్నారు. ఎకరాకు క్వింటా విత్తనాలే అవసరం కాగా అందుకు రూ. 30 వేలు ఖర్చు అవుతుంది. అంతర సేద్యం నీటితడులివ్వడంతో నాటిన మూడు నెలలకు మొదటి కోత వస్తుంది. ఒక్కో కోతకు 5 టన్నులు చొప్పున ఏడాదికి 15 టన్నుల దిగుబడి వస్తోంది. ఒక్కసారి భూమిలో విత్తనాలు విత్తితే 10 ఏళ్లపాటు దిగుబడి పొందవచ్చని రైతులు వివరించారు.



కరివేపాకు కోస్తున్న కూలీలు

తోటల వద్దకే ఇతర రాష్ట్రాల వ్యాపారులు..

విజయవాడ, ఒంగోలు, గుంటూరు, హైద్రాబాద్, పట్టణాల నుంచి వ్యాపారులే తోటల వద్దకు వచ్చి టన్నుల లెక్కన కరివేపాకును కొనుగోలు చేస్తున్నారు. డిసెంబర్ వరకు టన్ను రూ. 22 వేల నుంచి రూ.25 వేలు పలకగా జనవరిలో రూ. 40 వేలకు చేరింది. వ్యాపారులే తోటల వద్దకు రావడం వల్ల దళారుల బెడద లేదని, వ్యవసాయ ఉద్యానశాఖ అధికారుల సలహాలు, సూచనలతో నాలుగేళ్లుగా లాభాలు గడిస్తున్నట్లు రైతులు వివరించారు.

రెండెకరాల్లో సాగుచేశా..



ఐదేళ్లుగా రెండు ఎకరాల్లో కరివేపాకు సాగు చేపట్టాను. ప్రతి ఏడాది ఖర్చులు పోనూ నికర ఆదాయమే దక్కుతుంది. ఈ ధర ఏనాడు నేను ఊహించలేదు. రెండు నెలల పాటు ఇదే ధర కొనసాగితే లాభాలే లాభాలు. రైతులకు సంతోషంగా ఉంది.

– అవిశెన హనుమంతరెడ్డి, వల్లాపల్లి

ప్రకృతి వ్యవసాయంలో కరివేపాకు సాగు..



జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయంలో ఆరు ఎకరాల్లో కరివేపాకు సాగు చేపట్టాను. 11 సంవత్సరాలుగా కరివేపాకు సాగులో మెలకువలతో విస్తీర్ణాన్ని పెంచుకుంటూ అధిక ఆదాయం పొందుతున్నా. ఈ ఏడాది ధరను ఏనాడు చూడలేదు. రెండు నెలలు ఇదే ధర ఉంటే ఎకరాకు రూ. 5 లక్షల వరకు నికర ఆదాయం పొందవచ్చు.

– మేడగం శ్రీనివాసరెడ్డి, వల్లాపల్లి

ద్రోణాదులలో ఘనంగా తెప్పోత్సవం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు



పాఠశాల విద్యార్థుల కోలాట ప్రదర్శన



ద్రోణాదుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

మార్టూరు: మండలంలోని ద్రోణాదుల గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఘనంగా తెప్పోత్సవం నిర్వహించారు. గ్రామంలో కనుమ మరుసటిరోజు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా సాయంత్రం ఆలయంలోని కోదండరామ, ఆంజనేయ, వీరభద్ర, సోమేశ్వర స్వాముల వారి ఉత్సవ విగ్రహాలను గ్రామవీధులలో ఊరేగింపు నిర్వహించి అనంతరం గ్రామానికి తూర్పువైపున గల చెరువులో వందలాది భక్తులు వీక్షిస్తుండగా తెప్పోత్సవం నిర్వహించారు. గ్రామంలోని సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు నిర్వహించిన కోలాట ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. గ్రామంలోని రెండు ప్రదేశాలలో పాట కచేరి ప్రదర్శనలు నిర్వహించారు.

హోరాహోరీగా జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

బల్లికురవ: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నువ్వానేనా అన్నట్లుగా జరుగుతున్నాయి. ఈ నెల 8న ప్రారంభమైన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 56 టీమ్‌లు వచ్చినట్లు నిర్వహకులు తెలిపారు. 13 టీమ్‌లు తుదిదశ బరిలో నిలిచాయి. మంగళవారం జరిగిన పోటీల్లో ఉదయం కొమ్మినేనివారి పాలెం అంబేడ్కర్ యూత్, మార్టూరు మండలం రాజుపాలెం యూత్ మధ్య జరిగిన పోరులో అంబేడ్కర్ యూత్ విజేతగా నిలిచింది. సాయంత్రం కొప్పరపాడు వల్లాపల్లి మధ్య జరిగిన పోరులో కొప్పరపాడు టీమ్ విజేతగా నిలిచింది. మొదటి బహుమతిగా రూ. 30,116, రెండో బహుమతిగా రూ. 20,116, మూడో బహుమతిగా రూ.10,116 మేన్ ఆఫ్‌ది సిరీస్‌కు రూ. 3,116 అందజేస్తున్నట్లు నిర్వహకులు వివరించారు. పోటీలను తిలకించడానికి పరిసర గ్రామాల నుంచి ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేయాలి

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాలోనే గర్భిణులు, బాలింతలు కిశోర బాలికలు, చిన్నారులు, వృద్ధులకు సేవలందించేందుకు వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లను ఏర్పాటు చేసిందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్ మంగళవారం తెలిపారు. 20 సచివాలయాలకు భవనాలు మంజూరు అయ్యాయని, భవనాలు నిర్మాణం పూర్తి కాకపోయిన అద్దె భవనాల్లోనైనా హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌బీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అందుబాటులో ఉండాలని వైద్యాధికారి తెలిపారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పంచాయతీ సిబ్బంది

దొనకొండ: స్థానిక పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు దుకాణదారులకు ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు స్థానిక బస్టాండ్ సెంటరులోని దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సచివాలయం, ఎంఆర్‌ఓ, ఎంపీడీఓ కార్యాలయాల నుంచి రైల్వే స్టేషన్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే పర్యావరణ కాలుష్యంపై ప్రభావం చూపుతుందని వివరించారు. సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్ ఆదేశాల మేరకు తాము ఈ కార్యక్రమం చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి వివరించారు. ఉప సర్పంచ్ ఇమ్రాన్‌ఖాన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి



డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్టీఓ చంద్రశేఖర్‌రావు

పొదిలి రూరల్: పొదిలి తాలూకా పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాలకు చెందిన పెన్షన్ దారులు ఫిబ్రవరి నెలాఖరి నాటికి తమకు చెందిన లైఫ్ సర్టిఫికెట్‌లు సమర్పించాలని సబ్ ట్రెజరీ ఆఫీసర్ చంద్రశేఖర్‌రావు అన్నారు. మంగళవారం పొదిలి సబ్ ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్ల డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్‌దారుల సమస్యలు తాము పరిష్కరిస్తున్నామని చెప్పారు. వేలు ముద్రలు పడని పెన్షనర్లకు ఐరిష్ ద్వారా సర్టిఫికెట్లు సమర్పించేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. అనారోగ్యంతో బాధపడే వారికి, నడిచేందుకు వీలుకాని వారికి పెన్షన్‌దారుల ఇంటి వద్దకే సిబ్బంది వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లు ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సీఎఫ్ఎంఎస్ ఐడీ నంబర్‌కు ఆధార్ అనుసంధానం, ఈకేవైసీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. పొదిలి తాలూకా పెన్షన్‌దారుల సంఘ అధ్యక్షుడు బాదుల్లా, ప్రధాన కార్యదర్శి మదర్‌వలి, అసోసియేట్ అధ్యక్షుడు అనికాళ్ల వీరారెడ్డి, డీఎల్ నరసింహారావు, చిట్టెంశెట్టి వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, శ్రీహరి, గోవిందయ్య, తజానీ, దశరథులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం వివేకానందుడు

మార్కాపురం: యువతకు ఆదర్శం వివేకానందుడని తెలంగాణ హైకోర్టు సూపరింటెండెంట్ పీవీపీ అంజనీకుమారి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో గ్లోబల్ హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఆజాదిక అమృత మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా వివేకానంద జయంతి ఉత్సవాలు నిర్వహించారు. తిరుపతి, అనంతపురం పట్టణాల నుంచి వచ్చిన వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ నారాయణ స్వామి, కరిముల్లా, అసిస్టెంట్ ప్రొఫెసర్ బృందం మాట్లాడుతూ యువత బాధ్యత కలిగి ఉండాలని, అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

వేటపాలెం: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఐదుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు సంయుక్త ప్రకటనలో మంగళవారం తెలిపారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో హెక్సావేర్ టెక్నాలజీస్ సాఫ్టవేర్ కంపెనీ ప్రాంగణ ఎన్నికలు నిర్వహించింది. కళాశాల్లో 2023లో ఇంజినీరింగ్ పూర్తి కాబోయే విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలో 309 మంది విద్యార్థులు పాల్గొనట్లు తెలిపారు. అందులో కమ్యూనికేషన్ పరీక్షల్లో 26 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. ఎనిమిది మంది టెక్నికల్ రౌండ్ ఇంటర్వ్యూకు అర్హత సాధించినట్లు తెలిపారు. వీరిలో ఐదుగురు ఉద్యోగాలకు ఎంపికయ్యారని అన్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ. 4 లక్షల వార్షిక వేతనం, ఇతర అలవెన్సులు లభిస్తాయని కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి ఎస్ పూర్ణ చంద్రరావు తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ మెయిద వేణుగోపాలరావు, సీఎస్ఈ విభాగాధిపతి పి హరిణి, ఈసీఈ విభాగాధిపతి కే జగదీష్‌బాబు అభినందించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో జీవనోపాధి



అవగాహన కల్పిస్తున్న వెంకట నారాయణ

చినగంజాం: మహిళా గ్రూపులు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లను సమర్థవంతంగా నిర్వహించి ఆర్థిక పరిపుష్టి సాధించాలని వైఎస్ఆర్ క్రాంతి పథం ఏరీయా కోఆర్డినేటర్ అంబేడ్కర్ అన్నారు. మంగళవారం మండల వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సీడ్ క్యాపిటల్ లబ్ధిదారులు 42 మందికి సామర్థ్యం పెంపుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం 17, 18, 19 తేదీల్లో మూడు రోజులపాటు కొనసాగిస్తుండగా మొదటి రోజు ఫుడ్ ప్రాసెసింగ్ విధానంపై పరిచయ కార్యక్రమాన్ని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ రిసోర్స్ పర్సన్ దాసరి వెంకటనారాయణ ప్రారంభించి మహిళా గ్రూపులకు యూనిట్ నిర్వాహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్ఏపీఎం టీ మోహనరావు, ఏపీఎం అంజిబాబు, సీసీలు, వివిధ గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



జరుబులవారిపాలెం వద్ద శనగ పంటను పరిశీలిస్తున్న ఏవో



వేటపాలెం: విషపు ఎరను తయారీ విధానాన్ని చూపిస్తున్న అధికారులు

వేటపాలెం: రైతులు వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి ఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. మంగళవారం మండలంలోని చల్లారెడ్డిపాలెం, అక్కాయిపాలెం గ్రామాల పరిధిలోని వేరుశనగ పంటను పరిశీలించి ఆర్బీకేల వద్ద రైతులకు అవగాహన కల్పించారు. ముందుగు పొగాకు లద్దెపురుగు నివారణకు విషపు ఎరను ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. ఒక ఎకరాకు విషపు ఎరను తయారు చేసుకోవడానికి పది కిలోల తవుడు, రెండు కేజీల బెల్లం, 100 గ్రాములు ఎమామెక్టిన్ బెంజోయేట్ కలుపుకొని చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలని తెలిపారు. వీటిని పంట పొలాల్లో ఉదయం పూట వేయడం ద్వారా పొగాకు లద్దెపురుగు నివారించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో దక్షిణామూర్తి, వీఏఏలు రామారావు, వినోద్, జ్యోతి రైతులు పాల్గొన్నారు.

కారంచేడు: శనగ పంటను సాగు చేసిన అన్నదాతలు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉందని ఏవో కే శివనాగప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని జరుబులవారిపాలెం, దగ్గుబాడు, పోతినవారిపాలెం గ్రామాల్లో సాగు చేసిన శనగ చేలను పరిశీలించారు. కుంకుమ తెగులు కనిపించే చేలల్లో హెక్సాకొనజోల్‌ను ఒక లీటర్‌కు సుమారు మూడు ఎకరాల్లో పిచికారీ చేసుకోవాలన్నారు. శనగలో ఎండు తెగులు కనిపించిన చేలల్లో ట్రికోడెర్మావిరిడై ఒక కేజీని ఒక ఎకరా చేనులో పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు ఈ-కేవైసీ తప్పనిసరి

బల్లికురవ: ప్రభుత్వం 45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు మహిళలకు ఈబీసీ నేస్తంలో రూ.15 వేలు అందిస్తుందని దరఖాస్తుదారులు వలంటీర్ల ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 20 సచివాలయాల్లో ఈ పథకానికి గత ఏడాది 1142 మంది ఈఏడాది మరో 143 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. రెండు రోజుల్లోపు దరఖాస్తుదారులంతా బయోమెట్రిక్ వేయాలని, ప్రభుత్వం అర్హులందరి బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ చేస్తుందని ఎంపీడీవో చెప్పారు.

పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

చీరాల అర్బన్: పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో వెంకటరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఈపూరుపాలెంలో గల ప్రగడ కోటయ్య చిన్నారుల పార్కును ఆయన పరిశీలించారు. పార్కు వెనుక వైపు కూలిన గోడను బాగు చేయాలని, పార్కు మొత్తం తక్షణమే శుభ్రం చేసి మొక్కలు నాటాలన్నారు. పార్కులో పాతబడిన బావిని తొలగించి ఇంకుడుగుంతగా మార్చాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ ఆధ్వర్యంలో నడుస్తున్న రక్షిత నీటి ప్లాంట్‌పై సమీక్ష నిర్వహించారు. అలానే సిండికేట్ కాలనీ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని, ఆదినారాయణపురం, సీతారామపేట ప్లాంట్ల నిర్వహణ తీరును మెరుగుపరచాలని ఆయన ఆదేశించారు.

విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు



కిందకు జారిన వైర్లు, ఒరిగిన స్తంభం

బలికురవ: పాఠశాల క్రీడా మైదానంలో విద్యుత్ సరఫరా వైర్లు కిందకు జారి ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ స్తంభాలు ఒరిగిన ఆశాఖ అధికారులు పట్టించుకోవటంలేదని కొప్పరపాడు ఉన్నత పాఠశాల పీఎంసీ చైర్మన్ దమ్ము అంజయ్య సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలలో 3వ తరగతి నుంచి పది తరగతుల్లో 700 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, క్రీడా మైదానం లేనందున పాఠశాలకు దక్షిణం వైపున ఉన్న ప్రభుత్వ భూమిని పాఠశాలకు కేటాయించారని వివరించారు. ఈ స్థలంలోనే నాలుగేళ్లుగా ఆటలు ఆడుతున్నారని స్థలంలో నుంచి కాలనీలకు వెళ్లే విద్యుత్ లైన్‌లు జారటం, స్తంభాలు ఒరగడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయందోళన చెందుతున్నామని తల్లిదండ్రులు చెప్పన్నారు. ఇప్పటికైనా అధికారులు అశ్రద్ధ వీడి వైర్లను, స్తంభాలను సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.